

ప్రత్యేక కారాగారం పరిశీలన



నిందితులతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికారా సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ భీమవరం ప్రత్యేక కారాగారాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్థిక స్తోమత లేక జైలు నిందితులుగా కొనసాగుతున్న నేరం చేసే నాటికి 18 ఏళ్ల ల్లోపు ఉన్న వారి వివరాలు తీసుకున్నారు. ఉన్నత న్యాయస్థానాలు, ప్రభుత్వాలు ఉచిత న్యాయ సహాయం ద్వారా నిరుపేద నిందితులకు కారాగారం నుంచి విముక్తి కల్పించే యోచనలో ఉన్నట్లు కార్యదర్శి రత్నప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం న్యాయమూర్తులు ఎ.పవన్‌కుమార్, జి.సురేష్‌బాబు, డి.ధనరాజు, కారాగారం పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.



సిద్ధం సభలో మాట్లాడుతున్న జగన్, పక్కనే సభకు హాజరైన జనం

నేను సిద్ధం.. మీరూ సిద్ధంకండి..!



ఎన్నికల సన్నాహక సభలో కార్యకర్తలకు సిఎం జగన్ పిలుపు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా

ప్రతిఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై మాట్లాడాలి

ఏఒక్క సీటూ కోల్పోకూడదని సూచన

జనం రాకపోవడంతో సగం గ్యాలరీలు ఖాళీ

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

సిపిఎం, ప్రజాసంఘాల నేతలపై నిర్బంధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో మరో చారిత్రాత్మక విజయాన్ని అందుకునేందుకు 'నేను సిద్ధం.. మీరూ సిద్ధంకండి' అంటూ వైసిపి నాయకులు, కార్యకర్తలకు సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల స్థాయి వైసిపి 'సిద్ధం' సభ ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సిఎం జగన్ హెలీకాప్టర్‌లో సభా ప్రాంగణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి కాన్వాయ్‌లో సభా వేదికకు చేరుకున్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్యాలరీల మధ్యలో ఏర్పాటు చేసిన దారిగుండా కార్యకర్తలకు, నాయకులకు అభివాదం చేస్తూ కలియతిరిగారు. అనంతరం దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బాయిచౌదరి స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం వైసిపి అధ్యక్షుడు, సిఎం జగన్ మాట్లాడుతూ మరో చారిత్రాత్మక విజయాన్ని అందుకునేందుకు మీరంతా సిద్ధమేనా అంటూ కార్యకర్తలతో నినాదాలు చేయించారు. పేదల భవిష్యత్తును కాటేసే కరోనా వంటి దుష్టచతుష్టయంపై సంగ్రామానికి అక్కచెల్లెమ్మలు, అవ్వ, తాతలు, సోదరులు, స్నేహితులు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. మనం చేసిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి పంచుకోవాలన్నారు. లంచాలు, వివక్షకు తావులేకుండా డిబిటి ద్వారా నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ చేశామన్నారు. పథకాలతో లబ్ధి పొందిన వారంతా స్టార్ క్యాంపెయినర్లుగా మారాలన్నారు. జగన్‌కు ఓటేయకుండా, ప్రతిపక్షాలకు ఓటువస్తే పథకాల రద్దుకు ఆమోదం తెలిపినట్లే అన్నారు. ఏ ఒక్క సీటూ కోల్పోకూడదని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగినది ఏమిటో.. మన ప్రభుత్వంలో జరిగిన మంచి ఏమిటో జనాలకు తెలియపరిచే బాధ్యత కార్యకర్తలేదన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలకు అనేక పదవులు కేటాయించామన్నారు. భవిష్యత్తులో ఇంతకంటే ఎక్కువ పదవులిస్తామన్నారు. పార్టీలో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు. బాబు కుట్రలు, కుతంత్రాలు చిత్తు చేసేందుకు సోషల్ మీడియా పరంగా అంతా సిద్ధంగా ఉండాలని తెలిపారు. 60 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయని, మూడు నెలల్లో మన ప్రభుత్వం కొలువుదీరనుందంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు.

అనుకున్న స్థాయిలో రాని జనం

మూడు జిల్లాలో పరిధిలో నిర్వహిస్తున్న ఎన్నికల సభను భారీగా జరపాలని వైసిపి అధిష్టానం భావించింది. 150 ఎకరాల స్థలంలో సభ ఏర్పాటు జరుగుతుందని, లక్షల సంఖ్యలో జనం రానున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. స్కూల్, ఆర్‌టిసి బస్సుల్లో జనాన్ని తరలించేందుకు ప్రయివేటు స్కూళ్లకు సైతం సెలవులు ప్రకటించారు. దాదాపు 50 గ్యాలరీలు వరకూ ఏర్పాటు చేశారు. మూడు వేల మందికిపైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. అయితే అనుకున్న స్థాయిలో జనం రాకపోవడంతో చాలా గ్యాలరీలు ఖాళీగానే ఉండిపోయాయి. జనంలో అభివాదం చేస్తూ నడిచిన జగన్ సైతం గ్యాలరీల్లో జనం లేకపోవడంతో చివరి వరకూ వెళ్లకుండా మధ్యలోంచే తిరిగి వెనక్కి నడిచారు. బస్సులను రోడ్డుపైనే ఆపేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయి సభ అయినపోయిన తర్వాత తిరిగి వెళ్లేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సభకు వచ్చిన జనం ఇబ్బందులు పడ్డారు.

సిపిఎం, ప్రజాసంఘాల నాయకులపై నిర్బంధం

సిఎం ఎన్నికల సన్నాహక సభ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్‌ను పోలీసులు సిపిఎం, సిఐటియు కార్యాలయాల వద్ద నిర్బంధించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజుకు నోటీసులివ్వగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎన్.నర్సింహను గృహనిర్బంధం చేశారు. పోలీసుల తీరుపై ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం



బడ్జెట్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ శనివారం నవుడూరు సెంటర్లో బడ్జెట్ కాపీలను ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతాంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం ఊసేలేదన్నారు. ఈ నేపథ్యంలో రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి తాళ్లూరి హరిహర లక్ష్మణ్, నేతలు యాళ్లబండి నారాయణమూర్తి, వాసంశెట్టి ఆదినారాయణ, మొల్లి అప్పారావు, గజ్జి అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం

రాష్ట్రానికి అన్యాయంపై నోరు మెదపని వైసిపి, టిడిపి, జనసేన

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాల్లో ఒక్కటీ లేకపోవడం అంటే బిజెపి ప్రభుత్వం మరోసారి రాష్ట్ర ప్రజలను వంచిస్తోందని తేటతెల్లమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. శనివారం స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్ర ప్రజలను మరోసారి నిరాశకు గురి చేసిందన్నారు. మరోసారి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించే అంశంగాని, పోలవరం నిర్వాసితుల పునరావాసం, పరిహారంగాని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీలు వంటి అంశాలేవీ ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రాభివృద్ధి పట్ల బిజెపి వైఖరి ఏమిటో ఈ బడ్జెట్ కేటాయింపు స్పష్టం చేస్తుందన్నారు. రాష్ట్రం నుండి జిఎస్‌టి వసూళు పెరిగినా రాష్ట్రం వాటా మాత్రం పెరగలేదని తెలిపారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా వైసిపి, టిడిపి, జనసేన సహా అన్ని పార్టీలూ ముందుకు రావాలని కోరారు. బడ్జెట్ అభివృద్ధికి దోహదం చేస్తుందని టిడిపి ప్రకటన ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి కేంద్రం ద్రోహానికి వ్యతిరేకంగా ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్ బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిల్చిందన్నారు. ధరల పెంపుదలతో ప్రజలపై భారాలు పెరిగాయని, జిఎస్‌టి పేరుతో రెట్టింపు పరోక్ష పన్ను వసూలు చేయడమే దీనికి కారణమని విమర్శించారు. ప్రత్యక్ష పన్ను రాయితీలన్నీ కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి పెంపుదల భారమంతా మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతిపై, ఉద్యోగులపై వేయడం ఈ కాలంలో వారు సాధించిన ఘనత అని వివరించారు. సాధారణ ప్యాసింజర్ రైళ్లను తగ్గించి వందేభారత్ రైళ్ల పేరుతో ప్రయాణాలను భారంగా మార్చారని విమర్శించారు. ఈ అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి, అణచడానికి మతాన్ని అడ్డంగా ఉపయోగించుకుని రామనామ స్మరణతో ప్రజలను మాయ చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మతోన్మాద భావోద్వేగాలను రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరిచే బిజెపి వైఖరిని మేధావులు, లౌకికవాదులు, అన్ని పార్టీలూ ఖండించాలని కోరారు.

సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

జిల్లాలో డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తి చేసి సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కోరారు. జిల్లాలో కాలుష్యం పెద్ద సమస్యగా ఉందన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డెల్టా ఆధునికీకరణ పనులు ఏళ్లు గడుస్తున్నా కనీసం పూర్తి కాలేదని మండిపడ్డారు. జిల్లాలో టిడ్కో ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆర్భాటంగా పంపిణీ చేసిన జగనన్న కాలనీలు మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టి రోడ్ల సమస్య పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో ఎక్కువ గ్రామాల్లో దళితులు, శ్మశానవాటికలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ప్రతి దళిత పేటకు రెండెకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేస్తామని కమిటీలు చెబుతున్నాయని, తక్షణం ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేసి ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం అనేది చీకటి చట్టమని విమర్శించారు. భూయాజమాన్య హక్కులను దెబ్బతీసే చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, చింతకాయల బాబూరావు, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎ.అజయకుమారి, మామిడిశెట్టి రామాంజనేయులు, గొర్ల రామకృష్ణ, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి పాల్గొన్నారు.

9న 'నులి పురుగుల నిర్మూలన'

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ శివన్నారాయణరెడ్డి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 9న జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకటి నుండి 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలు జిల్లాలో 3,25,385 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి, ప్రతిఒక్కరూ వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ పిల్లలు 51,649 మంది, ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు 2,35,711 మంది, ఇంటర్ నుండి డిగ్రీ మొదటి సంవత్సరం వరకు 38,025 మంది మొత్తం 3,25,385 మందికి ఆల్బెండజోల్ మాత్రలను నూటికి నూరుశాతం అందించాలన్నారు. ఏకారణం చేతనైనా దూర ప్రాంతాలకు వెళ్లిన వారు ఎవరైనా ఉంటే అటువంటి వారిని గుర్తించి 16న మాత్రలను అందించాలన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన సమాచారం తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.భానునాయక్, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి బి.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ వాకపల్లి ప్రసాద్, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.భావన, విద్యాశాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ, ఇంటర్ డిఐఇఒ నరసింహమూర్తి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వివిఎస్ఆర్‌కె.కుమారి, ఐసిడిఎస్ ఎఒ సిహెచ్.సుజాతలక్ష్మి, డాక్టర్ పద్మ, డిపిఒ పి.సురేష్, 104 డిసి విలియమ్‌చంద్, జిల్లా కోఆర్డినేటరు ఎన్‌డిడి.రాజు పాల్గొన్నారు.

రైతుల సొమ్ము రూ.5 వేల కోట్లు చెల్లించాలి

జగన్‌కు ఉభయ గోదావరి జిల్లాల్లో తిరిగే నైతిక హక్కు లేదు

పోరుబాట పాదయాత్రలో ఎంఎల్‌ఎ నిమ్మల



ఆకుతీత పనిలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోడూరు

ఉభయగోదావరి జిల్లాలో దాళ్వా పంట అమ్మకంలో రైతుల నుంచి జగన్ ప్రభుత్వం దోపిడీ చేసిన రూ.ఐదు వేల కోట్లను తిరిగి చెల్లించాలని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. చెల్లించకపోతే ఉభయ గోదావరి జిల్లాలో తిరిగే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో దగా పడిన, మోసపోయిన రైతాంగానికి న్యాయం జరిగేందుకు పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చేపట్టిన రైతు పోరుబాట పాదయాత్ర రెండో రోజు శనివారం మండలంలోని మట్టపర్రు గ్రామం నుంచి ప్రారంభమై పెనుమదం, రావిపాడు, నేరేడుమిల్లి, మేడపాడు, ఆర్యపేట మీదుగా రాత్రికి యలమంచిలి చేరుకుంది. ఎంఎల్‌ఎ అక్కడే బస చేశారు. 25 కిలోమీటర్ల పొడవునా సాగిన పాదయాత్రలో పెద్ద సంఖ్యలో రైతులతో పాటు టిడిపి, జనసేన శ్రేణులు పాల్గొన్నారు. దారి మధ్యలో వరి ఆకుమడిలో రైతులు ఆకుతీత పనులు చేస్తుండగా ఎంఎల్‌ఎ ఆకు మడిలోకి దిగి రైతులతో మమేకమై పని చేశారు. పాదయాత్రకు రైతులు సంఘీభావం తెలపడంతో అనూహ్య స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రం పరిపుష్టిగా అభివృద్ధి చెందాలంటే ఆరుగాలం కష్టపడి అందరికీ అన్నం పెట్టి కడుపు నింపే అన్నదాతలు టిడిపి, జనసేన కూటమికి ఓటు వేసి గెలిపించాలని రైతు బిడ్డగా కోరుతున్నానన్నారు. టిడిపి జనసేన ప్రభుత్వ ఏర్పాటుతో రాజధాని, పోలవరం ప్రాజెక్టు, పరిశ్రమలు, విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు భక్షక కేంద్రాలుగా మారాయన్నారు. ఆక్వాకు విద్యుత్ రాయితీ ఎత్తివేయడంతో ఆ రంగం సర్వనాశనమై రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పెన్మత్స రామభద్రరాజు, దాసరి రత్నరాజు, బోనం నాని, ఆరిమిల్లి రామశ్రీనివాస్, పెద్దిరాజు, పెచ్చెట్టి బాబు, జివి, దొమ్మేటి శ్రీను, దేవరపు దొరబాబు, కేత హరికృష్ణ, కడలి ఆంజనేయులు, పాలా నాగలక్ష్మి, విప్పర్తి శారద పాల్గొన్నారు.

నేడు కూచిపూడి, జానపద నృత్య పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపంలో ఈ నెల నాలుగో తేదీ ఆదివారం క్షత్రియ సంక్షేమ పరిషత్, శ్రీ గౌరీ శంకర్ సంగీత, నృత్య కళా అకాడమీ సారథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల కూచిపూడి, జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు చెప్పారు. శనివారం ఆయన క్షత్రియ పరిషత్ భవనంలో మీడియాతో మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన వారికి రూ.56 వేల విలువైన అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అకాడమీ అధ్యక్షులు అయినాల సూర్యనారాయణమూర్తి, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, ముత్యాల శ్రీనివాస్, విన్నకోట వెంకటరమణ, తోట రాంబాబు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ సందర్శించారు. మైనర్ నిందితులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ క్లెయిమ్ చేసుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిందితులకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆర్థిక స్తోమత లేని నిందితులు ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది సూరిబాబు, ఉచిత న్యాయవాదులు కె.శిరీష, బి.శ్రీహరి, పాలకొల్లు ఉచిత న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు డి.వరలక్ష్మి, కె.మురళి, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు యువతరానిదే

రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి

నిట్‌లో ముగిసిన ఉల్కన్ జీ ఉత్సవాలు




ఉల్కన్ జీ ఉత్సవాల్లో వక్తలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ భవిష్యత్తు యువతరానిదేనని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నూతన ఆవిష్కరణల రూపకల్పనకు విద్యార్థులు పాటు పడాలని నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి సూచించారు. ఎపి నిట్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉల్కన్ జీ సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలే కీలకమని తెలిపారు. సృజనాత్మక ప్రతిభ కలిగిన విద్యార్థులకు డిమాండ్ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నూతన విద్యావిధానంలో పరిశోధనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ ప్రతిభ చూపుతుండటం అభినందనీయమన్నారు. రెండోరోజు ఇఇఇ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవ్ డాస్, కెమికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్కావెంజర్ హంట్, మెదడుకు పదును పెట్టే క్విజ్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, హుషారైన గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రమేష్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ సంతోష్, డాక్టర్ తలారి రేష్మా, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

ఎన్ని 'కలలో'..!



ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమ ఆకాంక్షలు నెరవేరేనా అనే ఆతృత, ఉత్కంఠ రాజకీయ పార్టీల నేతలతోపాటు వివిధ తరగతుల ప్రజల్లో నెలకొంది. తమకు టిక్కెట్ దక్కుతుందో, లేదోనని ఆయా పార్టీల్లో ఆశావహులు తర్జనభర్జనలు పడుతుండగా, అభ్యర్థిత్వాలు ఖరారైన వారు తమ గెలుపుబాట ఎలా వేసుకోవాలనే దానిపై వ్యూహాలు రచిస్తూ ముందుకు సాగుతున్నారు. టిక్కెట్ దక్కదు అని స్పష్టమైన వారు తమ భవితవ్యంపై ఆలోచనలు చేస్తూ పక్క పార్టీల వైపు చూస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల ముందైనా తమ సమస్యల పరిష్కారంపై పాలకులు ప్రకటనలైనా చేస్తారా.. కార్యాచరణ చేపడతారా అని వివిధ తరగతుల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను నిరాశ పర్చింది. ప్రధానంగా జిల్లాలో కొల్లేరు, పోలవరం నిర్వాసితుల సమస్యలు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నరసాపురం వద్ద వశిష్ట వారధిపై వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు వచ్చినా ఇప్పుడా ప్రస్తావనే లేదు. బడ్జెట్ ప్రవేశపెట్టిన జిల్లా కోడలు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో ఇక్కడ నుంచి రాజ్యసభకు నామినేట్ అయినప్పుడు నరసాపురం మండలంలో తీర ప్రాంత గ్రామాలు సముద్రపు కోతకు గురికాకుండా రక్షణ గోడ నిర్మించడానికి సర్వేలు, ప్రతిపాదనలు రూపొందించారు. ఈలోపు ఆమె రాజ్యసభ సభ్యత్వం ఇక్కడ పూర్తికావడం, మళ్లీ వేరే రాష్ట్రం నుంచి ఎన్నిక కావడంతో ఆ హామీలన్నీ బుట్టదాఖలయ్యాయి. నిట్‌కు నిధులు, నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్ పనులకు నిధులు, కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్ వంటి అంశాల ప్రస్తావనే లేదు. వేతన జీవులకు ఎప్పటిలానే నిరాశ మిగిలింది. వందేభారత్, బుల్లెట్ ట్రైన్ అంటూ హడావిడి చేస్తున్న కేంద్ర పెద్దలకు జిల్లా మీదుగా ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ అంశం కానరాకపోవడం గమనార్హం. మొత్తంగా కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక రాష్ట్ర బడ్జెట్‌లో వైసిపి పెద్దలు జిల్లాలోని సమస్యలను ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటారో వేచిచూడాలి.

ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి కొన్ని బకాయిలను విడుదల చేస్తోంది. దీంతోపాటు ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో యుటిఎఫ్ ముందుకెళ్లడం వైసిపి పెద్దలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పటికే వైసిపి ప్రభుత్వ తీరుతో విసిగిపోయారు. ఈ నేపథ్యంలో మధ్యంతరభృతి, ఒపిఎస్ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా స్పందిస్తుందా అనే ఆశతో ఉద్యోగులు నిరీక్షిస్తున్నారు.

ఇక డిఎస్‌సి ప్రకటన ఉద్యోగ అభ్యర్థుల్లో ఆశలకన్నా నిరాశనే ఎక్కువ నింపిందని చెప్పొచ్చు. మెగా డిఎస్‌సి వస్తుందనుకుంటే కేవలం 6,100 పోస్టులకే డిఎస్‌సి పరిమితం కావడం, ఉమ్మడి జిల్లాలో కేవలం 150 లోపు పోస్టులే భర్తీ చేయనుండటం వారిని కలవరపాటుకు గురిచేసింది. దీనికితోడు ఆ పోస్టుల కోసమే పోటీ పడదామా అనుకుంటే మళ్లీ అప్రెంటీస్ విధానాన్ని తెరపైకి తీసుకురావడం ప్రభుత్వానికి ఇష్టం లేకుండానే డిఎస్‌సి ప్రకటన చేసిందని ఉపాధ్యాయ అభ్యర్థులు వాపోతున్నారు. మరి ఎన్నికల ముందు ప్రభుత్వ విధానం మారుతుందో, లేదో వేచిచూడాలి.

బిఎల్‌ఒలే బలి పశువులా..!

రెండు జిల్లాల్లోనూ ఓటర్ల జాబితాలో తప్పులపై వస్తున్న ఫిర్యాదులకు బిఎల్‌ఒలను బాధ్యులను చేస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు చేపట్టడం చిరుద్యోగులను కలవరపాటుకు గురిచేస్తోంది. డబుల్ ఎంట్రీలు వంటి వాటిని ఆన్‌లైన్ చేసినా మళ్లీ అదే తప్పు పునరావృతం కావడం, ఉన్నతాధికారులు చర్యలు చేపడుతుండటంతో బిఎల్‌ఒ విధుల్లో ఉన్న వారు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో పది మందికిపై బిఎల్‌ఒలపై ఆయా కలెక్టర్లు సస్పెన్షన్ వేటు విధించారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో వాస్తవిక ప్రాతిపదికన పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటే ఎవరూ అభ్యంతరం చెప్పరని, దానికి భిన్నంగా ఆన్‌లైన్, ఇతరత్రా సమస్యల వల్ల చోటుచేసుకుంటున్న తప్పిదాలకు బిఎల్‌ఒలను బలి పశువులను చేయొద్దని పలువురు కోరుతున్నారు.

- విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ఆర్యపేటలో భారీ అగ్నిప్రమాదం

నాలుగు అంతస్తుల భవనంలో చెలరేగిన మంటలు

సుమారు రూ.3 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - యలమంచిలి


మంటల్లో దగ్ధమవుతున్న భవనం

మండలంలోని ఆర్యపేటకు చెందిన కొబ్బరివ్యాపారి కొడవటి వీరవెంకటసత్యనారాయణకు చెందిన నాలుగు అంతస్తుల భవనంలో సుమారు 14 లక్షల కొబ్బరికాయలు నిల్వ ఉంచారు. వాటి విలువ సుమారు రూ.1.60 కోట్లు ఉంటుంది. ఈ క్రమంలో ఆ భవనంలో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన కొబ్బరివ్యాపారి వద్ద పనిచేసే వ్యక్తి తన యజమానికి సమాచారం అందించారు. వీరవెంకటసత్యనారాయణ హుటాహుటిన భవనం వద్దకు చేరుకుని ఫైర్ స్టేషన్ సిబ్బందికి అందించాడు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. మొత్తం నాలుగు ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. నరసాపురం ఆర్‌డిఒ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

'పరీక్షను వాయిదా వేయడం సరికాదు'

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ విద్యాశాఖ పర్యావరణ విద్య పరీక్షను ఎటువంటి కారణాలు తెలియపరచకుండా వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం సభ కోసమే పరీక్షను వాయిదా వేయడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. సిఎం జగన్ ఎక్కడ సభ జరిగితే ఆ ప్రాంతంలో షాపులు మూయించడం, విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడడా ఆనవాయితీగా మారిందన్నారు. దెందులూరులో సభ నేపథ్యంలో ప్రజలను తరలించేందుకు బస్సుల వినియోగానికి ఇంటర్ పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేయడం ఏంటని ప్రశ్నించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఇంటర్ శాఖను వైసిపి రాజకీయ కేంద్రంగా తయారు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పద్ధతి కొనసాగితే కమిషనర్ కూడా అనర్హుడుగా చూడాల్సి వస్తుందన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో అటలాడటం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు.

జగనన్న కాలనీ లబ్ధిదారులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పాలకోడేరు


ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న బాలకృష్ణ

గొరగనమూడి జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ ఆర్‌డిఒ శ్రీనివాసులురాజును కోరారు. ఈ మేరకు భీమవరం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీనివాసులురాజుకు శనివారం బాలకృష్ణ వినతిపత్రం అందించారు. జగనన్న లే అవుట్‌లో నెలకొన్న ఇళ్ల స్థలాల సమస్యను విన్నవించారు. గ్రామంలో ఆర్‌ఎస్ నెంబర్ 98లో సుమారు 4.92 ఎకరాల్లో జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్‌ను అధికారులు ఏర్పాటు చేశారన్నారు. సుమారు 197 మంది నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసి ఇచ్చారన్నారు. ఈ అవుట్‌లో గ్రామానికి చెందిన 86 మందికి భూమిని స్వాధీనం చేయలేదన్నారు. గత నాలుగేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూమిని అందించి న్యాయం చేయాలని కోరారు.

హత్య కారకుల అరెస్టు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విశాఖపట్నంలో తహశీల్దార్ రమణయ్య హత్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.శివశంకర్ డిమాండ్ చేశారు. రమణయ్య హత్యను నిరసిస్తూ శనివారం తాడేపల్లిగూడెం రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రమణయ్య హత్యకు కారకులైనవారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రభుకుమార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిపాలనాధికారి నరసింహరావు, పోతురాజు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు ధర్నా నిరసన వ్యక్తం చేశారు. ధర్నాకు జిల్లా రెవెన్యూ ఉద్యోగ సంఘం కోశాధికారి, డిప్యూటీ తహశీల్దార్ జివిఎన్‌వి.పవన్‌కుమార్ నాయకత్వం వహించారు.

'ఓట్ల కోసమే డిఎస్‌సి నాటకం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు మెగా డిఎస్‌సి అని మరో కొత్త నాటకం తెర మీదకు తీసుకొచ్చిందని, ఐదేళ్లుగా డిఎస్‌సి ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వం 50,892 ఖాళీలు ఉండగా 6190 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడం ఓట్లు కోసమేనని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది దగా డిఎస్‌సి ప్రజలందరికీ అర్థమైందన్నారు. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న జగన్ గత ఐదేళ్లుగా ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ యువత మద్యం, గంజాయి మత్తులో తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. పని కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారన్నారు. జగన్ సిద్ధం మహాసభలకు ఇంటర్మీడియట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. టిడిపి పాలనలో రాష్ట్రం పెట్టుబ డుల్లో ప్రథమ స్థానంలో ఉంటే ప్రస్తుతం జగన్ పాలనలో గంజాయి మాఫియా వైసిపి పెద్దల అండతో నడుస్తూ దేశంలో అగ్రస్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

8 వరకు మనసారా ఆసరా సంబరాలు

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల ఎనిమిదో తేదీ వరకు మనసారా ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండలంలోని తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం ఆవరణలో ఐదో రోజు మనసారా ఆసరా సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 12 వేల మంది డ్వాక్రా మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళల జీవన స్థితిగతులు మార్చేందుకు, వారి ఆరోగ్య సంరక్షణ, వారి పిల్లల విద్యకోసం సిఎం జగన్ ప్రవేశ పెట్టిన కార్యక్రమాలు వివరించనున్నట్లు తెలిపారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలకే కాకుండా లేనివాళ్లకు భోజనం సదుపాయం ఏర్పాటు చేసి చీర ఇవ్వనున్నట్లు తెలిపారు.

సిఎం సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఉండి

ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం జగన్ సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైసిపి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఒంటరిగానే పోరాడుతుందన్నారు. సిద్ధం మహాసభ ఏర్పాటుతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు.

నరసాపురం : ఏలూరు జిల్లా దెందులూరులో జరుగుతున్న సిఎం జగన్ బహిరంగ సభకు నరసాపురం నుంచి పెద్దఎత్తున వైసిపి కార్యకర్తలు, నాయకులు బయలు దేరారు. కార్యాలయం నుంచి బస్సుల్లో కార్యకర్తలతో కలిసి నరసాపురం ఎంఎల్‌ఎ, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బయలుదేరారు.

భీమవరం రూరల్ : ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. భీమవరం టౌన్, భీమవరం మండలం, వీరవాసరం మండలాల నుంచి సుమారు 200 బస్సుల్లో, వంద కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. భీమవరం బైపాస్ రోడ్డులో జెండా ఊపి బస్సుల ర్యాలీని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు.

పాలకోడేరు : మండలంలోని చిన్న గ్రామాల నుంచి రెండు బస్సులు, పెద్ద గ్రామాల నుంచి మూడేసి బస్సుల్లో వెళ్లారు.

రెచ్చిపోతున్న ఈవ్‌టీజర్లు

విద్యార్థినులను వేధిస్తున్న వైనం

భయాందోళనలో యువతులు

గతంలో బ్లూ కోర్టు, దిశా వాహనాలతో గస్తీ

ఇప్పుడు శ్రద్ధ చూపడంలేదని పోలీసులపై విమర్శలు

ప్రజాశక్తి - నరసాపురం


దిశా వాహనంపై గస్తీ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ (ఫైల్ ఫోటో)

నరసాపురం పట్టణంలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ఆకతాయిల వల్ల యువతులు భయపడిపోతున్నారు. పలు కూడళ్లలోనూ, వీధి చివరిలోనూ, కళాశాల, స్కూల్ చివరిలోనూ ఆకతాయిలు ఆడపిల్లలను వేధిస్తున్నారు. తాజాగా శుక్రవారం రాయపేటలోని ఓ ప్రయివేట్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తూ వేగంగా బైక్ నడపడం వల్ల ఆ ఇద్దరు యువతుల్లో స్రవంతికి తీవ్ర గాయాలయ్యాయి. గతంలో పలు జూనియర్, డిగ్రీ కళాశాలలు, స్కూల్ విడిచిపెట్టే సమయంలో విద్యార్థినుల వెంటపడి వేధించే ఆకతాయిలకు చెక్కు పెట్టేందుకు పోలీసులు మఫ్టీలో ఉండి నిఘా వేసి యువకులను స్టేషన్‌కు తరలించి వాళ్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించేవారు. మరోసారి జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించేవారు. దీంతో కొన్నేళ్లు ఆకతాయిలు తగ్గుముఖం పట్టారు. పట్టణంలో పదికి పైగా కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 15 వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. పట్టణంలోని రాయపేట, శివాలయం సెంటర్, పీచుపాలెం, బస్టాండ్, పంజా సెంటర్, పాత బజార్, ధామస్ బ్రిడ్జి వంటి ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. స్పోర్ట్స్ బైక్‌లతో భయంకరమైన హారన్ శబ్దాలతో విద్యార్థులు కళాశాల నుంచి వచ్చే సమయాల్లో కళాశాల వద్ద మాటు వేస్తున్నారు. సైకిల్, నడిచే వెళ్లే విద్యార్థినులే వీరి టార్గెట్. చాలా మంది యువతులు ఈ వేధింపులు, వెకిలి వేశాలను మౌనంగానే భరిస్తున్నారు. ఇంట్లో చెప్తే తమ చదువులకు ఫుల్‌స్టాప్ పడుతుందోనని భయపడి చాలామంది అమ్మాయిలు మనోవేదన పడుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. భారీ శబ్దాలు చేసే సైరన్, హారన్‌లతో గుంపులుగా చేరి అమ్మాయిలను చూసే సమయానికి గద్దల్లా వాలిపోతున్నారు. చాలా మంది


ప్రమాదంలో గాయపడిన యువతి

మనకెందుకులే అని పోలీసులను ఆశ్రయించడం లేదు. దీంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. వాహనాలు సైతం రోడ్డుకు అడ్డుగా పెట్టి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలు కనిపిస్తే అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఆకతాయిల ఆట కట్టించేందుకు గతంలో స్టేషన్ పరిధిలో బ్లూ కోర్టు వాహనం, దిశ వెహికల్‌తో గస్తీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు తగినంత గస్తీ లేదని పోలీసులపై విమర్శలు వస్తున్నాయి. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అప్పట్లో పోలీసులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. ప్రస్తుతం తగినంత సిబ్బంది లేకపోవడంతో పోలీసులు కూడా శ్రద్ధ చూపడం లేదు. ఒక పక్క పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ఆకతాయిల వల్ల చదవలేకపోతున్నామని విద్యార్థినులు వాపోతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

కెవి.స్వామి, పట్టణ సిఐ

ఆకతాయిలపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం. ధైర్యంగా ఫిర్యాదు చేస్తే నిందితులకు శిక్ష పడేలా చూస్తాం. ఆకతాయిలు వేధిస్తే దిశ యాప్ 100, 94407 96617 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటికే నిఘా పెంచాం. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

పరిస్థితి విషమించి ఎంపిపి భర్త మృతి

కవిటంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - పోడూరు

ఎంపిపి సబ్బితి సుమంగళి భర్త విద్యాసాగర్ (51) గత నెల 19వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత నెల 19వ తేదీన విజయవాడలో జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై తిరిగి బస్సులో వస్తుండగా గన్నవరం సమీపంలో మూత్ర విసర్జనకు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలీని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సాగర్ తలకు బలమైన గాయమైంది. విజయవాడలో ఆసుపత్రిలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందారు. సాగర్ మృతదేహానికి శనివారం గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామమైన పోడూరు మండలం కవిటం శివారు నల్ల వెంకయ్య చెరువుకు తరలించారు.

పార్టీ శ్రేణుల్లో విషాదఛాయలు

ఎంపిపి సుమంగళి భర్త విద్యాసాగర్ మృతితో ఆయన స్వగ్రామమైన కవిటంలో తీవ్ర విషాదం నెలకొంది. వైసిపి సీనియర్ నాయకులుగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో విద్యాసాగర్ ఎంతో చురుగ్గా పాల్గొనేవారు. సాగర్ మృతితో మండల వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో విషాదం నెలకొంది. సాగర్ మృతదేహాన్ని చూసి ఆయన భార్య, కుమార్తెలు తీవ్ర దుఖంతో రోదించారు. వైసిపి కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి సాగర్ మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సాగర్ మృతదేహాన్ని జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, పెనుమంత్ర ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు), పోడూరు ఎంపిడిఒ డి.సుహాసిని, ఎపి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, కవిటం సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ, ఎంపిటిసి సభ్యులు కుక్కల సూర్యనారాయణ సందర్శించారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

బదిలీపై వెళ్తున్న కాళ్ల తహశీల్దార్ టిఎ.కృష్ణారావును శనివారం ఘనంగా సత్కరించారు. భీమవరం బదిలీపై వెళ్తున్న సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో కృష్ణారావును గ్రామ రెవెన్యూ అధికారులు శాలువ కప్పి జ్ఞాపికను అందించి సత్కరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం తహశీల్దార్ బదిలీ

గణపవరం : గణపవరం తహశీల్దార్ పమ్మిలక్ష్మి శనివారం మచిలీపట్నం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది లక్ష్మిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మండల విఆర్‌ఒల అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు తహశీల్దార్ జి.అనితకుమారికి శనివారం కార్యాలయ సిబ్బంది విఆర్‌ఒలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆమె ఎన్నికల విధుల్లో భాగంగా కోనసీమ జిల్లా మల్కిపురం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నరేష్, ఆర్‌ఐ శిరీష పాల్గొన్నారు.

కమ్మేసిన పొగ మంచు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలో శనివారం తెల్లారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు పొగ మంచు దట్టంగా కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు సరిగ్గా కనిపించక వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని డికె.వల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు డికె.వల్లి గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజల దాహార్తి తీర్చడానికి తన లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకు ద్వారా తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.ముసలయ్య, బి.శ్రీను, బి.గణపతి పాల్గొన్నారు.

నరసాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

నరసాపురం : తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ పథకాలు అందిస్తామని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్‌ఠాగూర్, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, క్లస్టర్, 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహరావు (బాబ్జీ), యూనిట్ ఇన్‌ఛార్జి మావురి ఆనంద్ కుమార్, షేక్ హుస్సేన్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ, మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, న్యాయవాద గుమస్తాలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యదేవి ప్రారంభించి మాట్లాడారు. పని ఒత్తిడితో సమయానికి హాస్పిటల్‌కి వెళ్లకపోవడం వల్ల కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్‌కుమార్, జి.సురేష్ బాబు, డి.ధనరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మొగళ్ల వెంకట రమణరావు, పరిపాలనాధికారి సీతారామ రాజు, ఎజిపి యు.వరప్రసాద్, న్యాయవాదులు, కోర్టు సిబ్బం ది, న్యాయ వాద గుమస్తాలు, మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది బి.ఫణికృష్ణ, పి.చిన్న, కె.దివ్యకాంతి పరీక్షలు నిర్వహించారు.

మరోసారి ఆశీర్వదించి గెలిపించాలి

ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ఉండి నియోజకవర్గం నుంచి టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా మళ్లీ పోటీ చేస్తానని, మరోసారి గెలిపిస్తే చంద్రబాబుకు ఉండి సీటును బహుమతిగా ఇస్తానని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. మండలంలోని దొడ్డనపూడిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి శనివారం నిర్వహించారు. దొడ్డనపూడిలో టిడిపి, జనసేన పార్టీ కార్యాలయాన్ని ఎంఎల్‌ఎ రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు సమన్వయంతో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. 2009, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో దొడ్డనపూడి గ్రామం నుంచి టిడిపికి అత్యధిక ఓట్ల మెజార్టీ వచ్చిందన్నారు. దొడ్డనపూడి గ్రామ ప్రజలకు రుణపడి ఉన్ననన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నప్రసాద్, టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, ఉప సర్పంచి కొప్పర్తి ఏసురాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు కొల్లి భోగేశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కందులపాటి వీరరాఘవులు, మాజీ సర్పంచి చికిలే శ్రీనివాస్, కట్రెడ్డి శ్రీనివాస్, కొల్లి శ్రీనివాసు, ఆరేటి కృష్ణ, ఆరేటి పద్మారావు, మంతెన సుబ్బరాజు, తోట ఫణిబాబు, టిడిపి, జనసేన నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' బాగుంది

నాయీ బ్రాహ్మణ జిల్లా సంఘం నేతలు

పాలకొల్లు : పాలకొల్లుకు చెందిన సినీ నిర్మాత బన్నీవాసు నిర్మించిన అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ సినిమా చాలా బాగుందని, ఈ సినిమా నాయీ బ్రాహ్మణులకు సంబంధించిన కథాంశం అని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు చెప్పారు. పాలకొల్లులోని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుమ్మలూరి శ్రీహరిరావు, జనరల్ సెక్రటరీ కొడవ టి శివప్రసాద్, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఉప్పలపు దుర్గా పెద్దిరాజు మాట్లాడారు. వివిధ బిసి సామాజిక తరగతివారికి, పెత్తందారులకు మధ్య జరిగి న కథాంశం చాలా బాగుందని చెప్పారు. ఈ సినిమా వల్ల నాయీ బ్రాహ్మణులకు సమాజంలో గౌరవం మరింత పెరి గిందని చెప్పారు. త్వరలో బన్నీవాసును సత్కరించాలని నిర్ణ యించారు. తమ సామాజిక తరగతికి చెందిన హీరో సుహాగ్, దర్శకుడు దుష్యంత్ చిత్రాన్ని బాగా మలిచారని ప్రతి బిసి సామాజిక తరగతివారు తప్పక చూడాలని వారు కోరారు. జనసేన నేతలు తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, కొమ్ముల దినేష్, నవీన్, సాయి పాల్గొన్నారు.

కళాశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

నరసాపురం : స్థానిక బిజిబిఎస్ మహిళా కళాశాలలో ఫౌండర్, పద్మశ్రీ అద్దేపల్లి సర్విచెట్టి వర్ధంతిని శనివారం నిర్వహించారు. చెట్టి మనవడు మధుకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న సర్విచెట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రెసిడెంట్ నూలి వెంకట రమణ మాట్లాడారు. నూతనంగా నిర్మించిన భవనం, ఆర్‌ఓ ప్లాంట్‌ను ట్రెజరర్ తుమ్మపల్లి వీరభద్రం, భవానిప్రసాద్, ఎ.మధుకుమార్, ప్రిన్సిపల్ సి.నీరజ చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం కళాశాల సెమినార్ హాలులో సభ నిర్వహించారు.

నిర్లక్ష్యం.. నీరుగారుతున్న లక్ష్యం

విద్యార్థులకు మందుల పంపిణీలో లోపాలు

పర్యవేక్షించని అధికారులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్


సచివాలయంలో మూలన ఉన్న మందులు

విద్యార్థులకు రక్తహీనత, ఇతర సమస్యలు లేకుండా ఉండేందుకు ప్రతి నెలా వైద్య సిబ్బందితో పంపిణీ చేసే కార్యక్రమం సక్రమంగా అమలు కావడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అనేక లోపాలు కనిపిస్తున్నా ఉన్నతాధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారని చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి కొన్ని ప్రాంతాల్లో జరిగే మందుల పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటుందని పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

స్థానిక ఐదో వార్డు సచివాలయంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన మందులను అక్కడ సిబ్బంది ఒక గదిలో సంచుల్లో, అట్టపెట్టలో పెట్టి ఉంచారు. దుమ్ము, ధూళి పేరిగిపోయి దర్శనమిస్తున్నాయి. ఇంటి పన్ను మార్చడం లేదని బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు సచివాలయానికి వెళ్లిన విలేకర్ల విద్యార్థులకు అందించే మందులు మూలన ఉండడం చూసి ఈ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఆ వార్డు పరిశీలికునిగా ఉన్న మెడికల్ ఆఫీసర్ ఎస్.ప్రసాద్ వచ్చి మందులను, వాటి కాల పరిమితిని పరిశీలించారు. విద్యార్థులకు ప్రతినెలా ఐరన్, బి కాంప్లెక్స్, డోలో 650 మందులను ఉపాధ్యాయుల ద్వారా అందిస్తున్నారు. ఈ మందులకు కాల పరిమితి అయిపోలేదని, ఎల్ సెంటర్ లేకపోవడంతో సచివాలయంలో పెట్టారని తెలిపారు. మందుల పంపిణీ తర్వాత మిగిలిన మందులను బయట ఎక్కడ పెట్టకూడదని ఆ పరిధిలో ఉన్న పిహెచ్‌సికి అందించాలని చెప్పారు. మందులను ఎందుకు పంపిణీ చేయలేదని ఎఎన్ఎం మంగళను, ఆశావర్కర్ జ్యోతిమణిని ప్రశ్నించారు. ఈ మందుల విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని తెలిపారు. మందులు ఎందుకు పంపిణీ చేయలేదో, ఎన్ని మందులు పంపిణీ చేశారో అన్నదానిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నెల రోజుల్లో బాధ్యులైనవారిపై చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

ఆరోగ్య శాఖలో కొందరి వల్ల ఆ శాఖ మందు మాఫియాగా తయారైందని సోషల్ ఎక్టివిస్ట్ అల్లూరి అరుణ్ అన్నారు. విద్యార్థులకు అందించాల్సిన మందులు ఒక గదిలో పడేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడంతో ఎన్నో మందులు ఉపయోగం లేకుండా నాశనమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కటకం బాబూరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. అతనికి వైద్యం నిమిత్తం రూ.50 వేల చెక్కు కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు శనివారం అందించారు.

భూ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరి తీరంలో ఉన్న లంక భూములపై రైతులకు హక్కు కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని రాజులలంక పంచాయతీకి సంబంధించిన 86 ఎకరాలు లంక భూములను సి-నమూనా భూములుగా రెన్యువల్ చేసిన పట్టాలను ఆయన క్యాంపు కార్యాలయంలో 69 మంది రైతులకు శనివారం పంపిణీ చేశారు.

పెనుగొండలో 'ప్రజల వద్దకు పితాని'

ప్రజాశక్తి - పెనుగొండ

మండల కేంద్రమైన పెనుగొండలో శనివారం ప్రజల వద్దకు పితాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మల్లు లక్ష్మీనారాయణ, ఆచంట జెడ్‌పిటిసి సభ్యులు సురేష్‌బాబు, సర్పంచి శ్యామల సోని, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

'సిద్ధం సభకు రావాలని బెదిరించడం దారుణం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిద్ధం సభకు రాకపోతే పెన్షన్, సంక్షేమ పథకాలు రాకుండా చూస్తామని బెదిరించడం దారుణమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధం సభకు రాకపోతే పెన్షన్ కట్ చేస్తాం, సంక్షేమ పథకాలు రాకుండా చూస్తామఅంటూ ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. అతి త్వరలోనే జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటికి పంపిస్తారన్నారు.